శాకంబరిగా ఎదురుగడ్డ మైసమ్మ



రాయదుర్గం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలి డివిజన్ మధురానగర్‌లోని ఎదురుగడ్డ మైసమ్మ అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాఢ చివరి శుక్రవారం కావడంతో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పూలు, నిమ్మకాయలతో తయారు చేసిన హారాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంతకుముందు అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ప్రతినిధులు రమేష్‌గౌడ్, వెంకటేష్, రమేష్‌గౌడ్ పర్యవేక్షించారు.పెద్ద సంఖ్యలో కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే దోమల నివారణ



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఎం ఎస్‌కే తాజ్‌బాబు, జీహెచ్‌ఎంసీ అధికారులు

రాయదుర్గం: దోమల నివారణలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది చేపట్టే చర్యలకు అందరూ సహకరించాలని రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కేతాజ్‌బాబు అన్నారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్, ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' నినాదంతో విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ కుటుంబసభ్యులు, చుట్టూరా ఉండే వారికి దోమల వల్ల కలిగే ఇబ్బందులను వివరిస్తూ దోమల నివారణలో భాగస్వాములు కావాలన్నారు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పలువురు జీహెచ్‌ఎంసీ, ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాన కుమ్మేసింది..

రహదారులు జలమయం
వాహనదారుల అవస్థలు



గచ్చిబౌలి కూడలిలో..



కైలాష్‌నగర్‌లో నీటిని తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

శేరిలింగంపల్లి జోన్ బృందం: భారీ వర్షంతో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో శుక్రవారం సాయంత్రం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాటర్ లాగింగ్ ప్రాంతాల ను గుర్తించి బాగు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించినా అది ఆచరణకు నోచుకోలేదు.పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ జంట సర్కిళ్ల అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సిబ్బంది రోడ్డుపై నీరు నిలిచి ఉండకుండా తగిన చర్యలు తీసుకున్నారు. మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, గచ్చిబౌలి కూడలి, బయోడైవర్సిటీ పార్కు కూడలి, లింగంపల్లి, చందానగర్ నుంచి మియాపూర్ వరకు పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు స్తంభించాయి.



చందానగర్-మియాపూర్ రోడ్డులో..



దీప్తిశ్రీనగర్‌లో..

విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలి



చందానగర్: ఈ నెల 23న నిర్వహించనున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి, జిల్లా నాయకులు పవన్ చౌహాన్, ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.శంకర్, జిల్లా నాయకులు యం.శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం చందానగర్‌లోని విద్యార్థి సంఘాల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యా శాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియల్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆక్రమణలు తొలగించండి

హైడ్రా కమిషనర్, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే వినతి

పటాన్‌చెరు: ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం గ్రామ పరిధిలో గల ఆరు కుంటల భూమి ఆక్రమణకు గురి కావడంతో వీటిపై ఆధార పడిన మత్స్యకారుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని..వెంటనే ఆక్రమణలు తొలగించి చేపల పెంపకానికి అనువుగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అహ్మద్ హుస్సేన్‌ను హైదరాబాద్‌లోని ఆయా కార్యాలయాల్లో శుక్రవారం కలసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన అధికారులు వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

శాంటా మారియాలో పికిల్‌బాల్ కోర్టులు ప్రారంభం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని శాంటా మారియా ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం పికిల్‌బాల్ కోర్టులను స్కూల్ చైర్మన్, అధ్యక్షుడు ఆరోగ్యరెడ్డి ప్రారంభించారు. ప్రముఖ క్రీడా సంస్థ గేమ్‌పాయింట్‌తో కలిసి శాంటా మారియా స్కూల్‌లో ఐదు అత్యాధునిక పికిల్‌బాల్ కోర్టులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆరోగ్యం, ఆనందం కోసం పికిల్‌బాల్ కోర్టులు ఏర్పాటు చేశామన్నారు. గేమ్ పాయింట్ సహ వ్యవస్థాపకులు, సీఈఓ ఆదిత్యరెడ్డి మాట్లాడుతూ స్కూల్ సమయాలకు మించి క్రీడా మౌలిక సదుపాయాలను నిర్వహించడానికి భాగస్వామ్యం చేసుకున్న మూడో స్కూల్ అన్నారు. శాంటా మారియా ఇంటర్నేషనల్ స్కూల్ బాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, క్రికెట్ కోసం అద్భుమైన సౌకర్యాలను అందిస్తుందన్నారు.

ఆధునిక హంగులతో రోడ్డు విస్తరణ



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి నుంచి శ్రీదేవి థియేటర్ మీదుగా అమీన్‌పూర్ వరకు రోడ్డు విస్తరణ పనుల్లో అత్యాధునిక హంగులు కల్పిస్తున్నట్లు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. శుక్రవారం చందానగర్ శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులను ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.45 కోట్ల అంచనా వ్యయంతో 2.7 కిలో మీటర్లు నాలుగు లేన్లు, రెండు లేన్ల సర్వీస్ రోడ్డుగా విస్తరించనున్నట్లు తెలిపారు. పనులు త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చుట్టు పక్కల కాలనీ వాసులు, ప్రజల సమస్య త్వరలోనే పరిష్కారం కానుందన్నారు. ప్రజావసరాల దృష్ట్యా శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్ పూర్ వరకు రోడ్డు నిర్మించనున్నామన్నారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ తగ్గించడానికి రోడ్లు, లింక్ రోడ్లు, ఫ్లెఓవర్లు, అండర్ బ్రిడ్జిలు, కొత్త రోడ్లు పూర్తి చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మార్గదర్శకంతో మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ అధికారులు డీఈ హరిష్ బాబు, ఏఈ శివ కృష్ణ యాదవ్, సౌమ్య, టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, టీపీఎస్ రోహన్, నాయకులు సందీప్ రెడ్డి, నరేందర్ బాల్ల, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ క్యాంపస్‌లో అన్ని మెస్‌లను తెరిపించాలి

చీఫ్ వార్డెన్‌కు ఏబీవీపీ నేతల వినతి



చీఫ్ వార్డెన్‌తో సమావేశమైన ఏబీవీపీ నేతలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని అన్ని హాస్టళ్లలోని మెస్‌లను తెరిపించాలని కోరుతూ హెచ్‌సీయూ చీఫ్ వార్డెన్‌కు ఏబీవీపీ హెచ్‌సీయూ ప్రతినిధి బృందం వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి హాస్టల్‌లోని మెస్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలనానరు. క్యాంపస్‌లోని విద్యార్థులకు భోజనాల కోసం ఎలాంటి సమస్యలు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. దశలవారీగా అన్ని మెస్‌లను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని ఆయన విద్యార్థి నాయకులకు హామీ ఇచ్చారు. క్యాంపస్‌లోని విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. చీఫ్ వార్డెన్‌ను కలిసిన వారిలో ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనీల్‌కుమార్, కార్యదర్శి ఆయుష్‌కుమార్‌సింగ్ ఉన్నారు.

బీటీఎన్‌జీఓస్ సొసైటీకి స్థలాన్ని అప్పగించాలి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని భాగ్యనగర్ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ మ్యూచివల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన స్థలాన్ని వెంటనే అప్పగించాలని కోరుతూ సీనియర్ ఐఏఎస్ అధికారులకు సొసైటీ ప్రతినిధులు వినతిపత్రాన్ని సమర్పించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి శేషాద్రికి కలిసి వినతి పత్రాలను సమర్పించారు. సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ ఎంహుస్సేని ముజీబ్,అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి సత్యనారాయణగౌడ్, ఉపాధ్యక్షుడు కొండల్‌రెడ్డి అధికారులను కలిసిన వారిలో ఉన్నారు. దాదాపు 4వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు, సర్వీసులో ఉన్న ఉద్యోగుల కుటుంబాలకు చెందిన స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని వారు ఆరోపించారు. వారిని అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా సొసైటీకి స్థలాన్ని అప్పగించాలని కోరారు. ఈ విషయంలో తగిన విచారణ జరిపి ఉద్యోగులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.